# బాధ్యత నెరిగిన బంధం

**-పొట్లూరి సుబ్రహ్మణ్యం**

**అప్పుడు సమయం రాత్రి పన్నెండు గంటలు. అందరూ గాఢ నిద్రలో ఉండే వేళ. ఆ సమయంలో ఇంట్లోని లైట్లన్నీ ఆర్పి కిటికీలోంచి మౌనంగా చూస్తూ ఉంది మాధవి. ఇంటి చుట్టూ గాఢాంధకారమైన చీకటి. దూరంగా వీధి లైటు మాత్రం మినుకు మినుకుమంటూ ఉంది.**

తనజీవితం కూడా ఈ చీకటిలాగే అంధకారమై పోయింది. మినుక్కు మినుక్కుమనే వీధిలైటు లాగే తన జీవితంలో సంతోషంకూడా అందనంత దూరంలో ఉంది. ఆ దీపం ఎప్పుడారిపోతుందో తెలియనట్టు తన జీవితం కూడా ఎప్పుడయినా అంతం గావచ్చు.

వారమయింది నందనరావు తనను ఒంటరిగా విడిచి వెళ్ళి. ఎక్కడికి వెళ్ళాడో, ఏం చేస్తున్నాడో, ఎప్పుడొస్తాడో తెలియదు.

ఆమెకు గతం తడిసిపోయిన నవల్లోని అక్ష రాల్లా అస్పష్టంగా కళ్ళముందు కదలాడసాగింది.

OOO

నందనరావు ఒక ప్రయివేటు ఇంజనీరు. ఒక కాంట్రాక్టరు దగ్గర పని చేస్తాడు. వైజాగ్ సమీపం లోని ఆ ఊరికి కాంట్రాక్టు పనుల నిమిత్తం వచ్చాడు. పనులు పూర్తయ్యేంత వరకు అక్కడ ఉండవలసి రావడంతో మాధవి ఇంట్లో ఒక గదిలో అద్దెకు దిగాడు. మాధవి భర్త పేరు జనార్దన్. అత నొక రైతు. నందనరావు అతి త్వరలోనే మాధవి చేత ఆకర్షింపబడ్డాడు.

పని మనిషిద్వారా సేకరించిన వివరాల ప్రకారం మాధవికి పట్నం జీవితమంటే విపరీతమైన మోజని, ఫ్యాషన్లంటే పడి చస్తుందని తెలుసుకు న్నాడు. దానితో నందనరావు ఆమెతో ఆమాటా ఈమాటా కలిపి పరిచయం పెంచుకున్నాడు. పట్నం వెళ్ళి వచ్చినప్పుడల్లా చిన్న చిన్న వస్తువుల్ని తెచ్చి ప్రెజెంట్ చేయసాగాడు. ఆమె కూడా కాదన కుండా వాటిని తీసుకోవడం మొదలుపెట్టింది.

అతను అంతగా ఆమెతో కలసి తిరుగుతున్నా హద్దు ల్లోనే ఉండసాగాడు.

రోజులు గడిచే కొద్దీ నందనరావు, మాధవిల మధ్య పరస్పర ఆకర్షణ ఎక్కువ కాసాగింది. ఒకర్ని విడిచి ఒకరు దూరంగా ఉండలేని స్థితికి వచ్చారు. ఇద్దరి మధ్యా ఎప్పుడూ సరస సంభాషణలే. ఎప్పుడూ ఛలోక్తులే.

ఆ రోజు సాయంత్రం నుంచీ ఎడ తెరిపిలేని వర్షం. రాత్రి పదయింది. అయినా వర్షం తగ్గలేదు. నందనరావుకు నిద్రపట్టడం లేదు. పదే పదే అతనికి మాధవి గుర్తొచ్చి మనసు కలవరపెడుతోంది.

ఉదయమనగా పట్నం వెళ్ళిన జనార్దన్ ఇంకా ఇంటికి వచ్చినట్టు లేదు. వచ్చుంటే తనను తప్పక పలకరించే వాడు. రాత్రి తొమ్మిది గంటలకే లాస్టు బస్సు. దాని తరువాత బస్సుల్లేవు. కనుక రాత్రికి జనార్దన్ రాడని నిర్ణయించుకున్నాడు. కాంట్రాక్టు పనులు కూడా పూర్తయ్యాయి. ఇక ఈ ఊర్లో తనకు పని లేదు. ఈరోజు అటో ఇటో తేల్చుకో వాలి అనుకున్నాడు.

ఈ ఆలోచన రాగానే మంచం మీద నుంచి లేచి తన గదికి తలుపులు పెట్టి మెల్లగా వరండాలోకి వచ్చాడు. వర్షం మూలంగా గంట నుంచి కరెంటు కూడా లేదు.

చిన్నగా తలుపు తట్టాడు.

రెండు నిముషాలకు కిటికీ దగ్గరకు వచ్చిన మాధవి కిటికీ తలుపు సగం తెరిచి ''ఎవరండీ'' అంటూ అడిగింది.

''నేనండీ - నందనరావుని.''

''మీరా. రెండు నిమిషాలుండండి తీస్తాను'' అంది తను వేసుకున్న నైటు గౌను చూసుకుంటూ.

''అర నిమిషం కూడా ఉండలేను. బయట వర్షపు జల్లు. ముద్దయిపోతున్నాను'' అరిచాడు. ఇక తప్పదన్నట్టు తలుపు తీసింది. విసురుగా కొట్టిన గాలికి ఆమె చేతిలోని కొవ్వొత్తి ఆరిపోయింది. తలుపు దగ్గరకు వేయడానికి ఇద్దరూ ఎవరికి వారే ముందుకు రావడంతో అతని చేయి మీద ఆమె చేయి, అతని వీపుకు ఆమె అమృత కలశాలు స్పర్శిం చాయి. వేడితో కాగిపోయే నందనరావు శరీరానికి ఇది కూడా తోడ్పడింది.

తలుపు గడియపెట్టిన తరువాత జేబులోంచి లైటరు తీసి కొవ్వొత్తి వెలిగించాడు.

నందనరావు ఆమెను చూసి పకపకా నవ్వాడు.

''ఏం? ఎందుకొస్తుంది నవ్వు'' కోపంగా అడి గింది.

''నీ డ్రస్సు చూసి.''

''నువ్వేగా ఇచ్చావు. రాత్రుళ్ళు ధరించే నైటు గౌనని.''

''ఇచ్చాను. నిజమే. ఊళ్ళో వాళ్ళంతా గౌర్రె లని నీకిచ్చాను. కాని...''

''నేను కూడా గొర్రెనంటావు. అంతేనా'' రోషంగా అంది.

''నువ్వు గొర్రెవనుకొంటే నేనిది ఇస్తానా. నా దృష్టిలో నువ్వో అప్సరసవి. అయితే ఇది ధరించే పద్ధతి అదిగాదు.''

''అవునా. అరరె...'' నాలుక కొరుక్కుంది మాధవి.

నందనరావు దగ్గరగా వచ్చి ''ఇలా చీర జాకెట్టు మీద నైటు గౌను వేసుకోకూడదు మాధవీ. అవి తీసి ప్రక్కన పెట్టాలి'' అన్నాడు తమాషాగా.

''ఛ... ఛ... నాకు సిగ్గేస్తుంది బాబూ'' గారం గా అంది. అంటూనే అతను చెప్పినట్టు చేసి నైటు గౌను ధరించింది.

ఆ గారం అతనికి ఆహ్వానంలా వినిపించింది. దగ్గరగా వచ్చి ఆమెను అమాంతం కౌగలించు కున్నాడు.

అప్పటి వరకూ ఉద్రేకాన్నంతా బిగబట్టుకొని ఉన్న మాధవి ఇక ఆగలేక నందనరావుని రెండు చేతులతో బిగించి వేసింది.

సరిగ్గా రెండో రోజు నందనరావుతో లేచిపో యింది మాధవి. వైజాగ్‌లో ఓ చిన్న ఇల్లు అద్దెకు తీసుకొని అందులో పెట్టాడు ఆమెను.

దాదాపు అయిదేళ్ళు గడిచిపోయాయి. ఈ అయిదేళ్ళూ అయిదు రోజుల్లా అనిపించింది




మాధవికి. నందనరావుకు క్రమేణా మాధవి మీద మోజు తగ్గిపోసాగింది. మాధవి ఇంటికి రావడం కూడా తగ్గించి వేశాడు. దానికి తగ్గట్టు చేతికి డబ్బు కూడా ఇంతకు ముందులా ఇవ్వటం లేదు. ఆర్థికంగా చాలా ఇబ్బందులు పడసాగింది. చివరకు ఇంటి అద్దె కట్టలేని స్థితికి వచ్చింది.

OOO

... గతంలోంచి తెప్పరిల్లి ఈ లోకంలోకి వచ్చింది. దూరంగా చెట్లమీద పక్షులు కిలకిలామంటున్నాయి. చీకట్లు కూడా విడిపోతున్నాయి. దగ్గరలోని రామకృష్ణా బీచ్‌లో ఒడ్డుకు కొట్టుకుంటున్న అలలమోత స్పష్టంగా వినిపిస్తోంది. ఆమె తెల్లవార్లు జాగరణకు ఫలితం లేనట్టు ఆరోజు కూడా నందనరావు రాలేదు.

సరిగ్గా మరో వారం తరువాత వచ్చాడు.




ఆ రోజు నందనరావుని నిలదీసింది మాధవి.

''ఏందే కట్టుకున్న పెళ్ళాంలా నన్నే అడుగుతున్నావ్. నా ఇష్టం వచ్చినప్పుడు వస్తాను. నీకెందుకే.''

''కట్టుకున్న పెళ్ళాన్ని కాకపోయినా నీ వెంట లేచి వచ్చిన ఆడదాన్ని. నమ్ముకొన్న నాకు ద్రోహం చేయడం న్యాయం కాదు.''

''అయితే ఏం చేయుసుంటావు. నీకంటే అందగత్తెలు కో అంటే కోటి మంది నా వెనుక వస్తారు. డబ్బే డబ్బుంటే చాలు. వెతుక్కుంటూ వస్తారు.''

''అంటే నేను గాక ఇంకా వేరే ఆడవాళ్ళతో సంబంధాలున్నాయా మీకు'' గర్జిస్తూ అంది మాధవి.

''ఉన్నాయే. చాలా ఉన్నాయి. నీకంటే వయసు తక్కువ, నీకంటే అందంగా ఇప్పుడిప్పుడే విరిసిన తాజా పువ్వులు చాలా ఉన్నాయి'' తాపీగా అన్నాడు నందనరావు.

''ఛీ... నీ ముఖం చూడకూడదు'' ఏడుస్తూ అంది.

''నా ముఖం చూడకపోతే నువ్వింక బ్రతకలేవే. మొగుడా... ఊళ్ళోకి వెళ్తే కాళ్ళు విరగ్గొడతాడు. ఇక మీ ఇంటికి తలెత్తుకొని పోలేవు. ఇక కుక్కలా నా దగ్గర పడుండాల్సిందే. లేకపోతే నీకు ప్లాట్‌ఫారమే గతి'' వ్యంగ్యంగా నవ్వుతూ వెళ్ళిపోయాడు.

మాధవి కుప్పలా కూలిపోయింది. తనెంత మోసపోయిందో అర్థమయిపోయింది. దేముడు లాంటి భర్తను వదలి తను ఇలా అవమానాలు పడాల్సొచ్చింది గదాని చాలాసేపు దుఃఖించింది.

ఆరోజు సాయంత్రమనగా వెళ్ళిన వాడు అర్థరాత్రి తిరిగి వచ్చాడు. మళ్ళీ ఇద్దరికీ వాగ్యుద్ధం. కోపం పట్టలేక నందనరావు సీసాలో ముందుగానే తెచ్చి పెట్టుకొన్న యాసిడ్ ఆమె ముఖంమీద చల్లాడు. ఆమెకు ముఖమంతా భగ్గున మండింది. కళ్ళు అతి కష్టంమీద తెరచుకొని చూసింది. ఎదురుగా చేతిలో సీసాతో భయంకరంగా నిలబడి ఉన్నాడు నందనరావు.

''ఒసేయ్... నువ్వే అంతగత్తెనని మురిసిపోతున్నావు కదూ. నీ గర్వం తగ్గడానికే నీ ముఖంమీద యాసిడ్ చల్లానే. చావు. కుక్క చావు చావు. ఇక నీ ముఖం చూసేవాడు ఉండడే'' బిగ్గరగా నవ్వుతూ వెళ్ళిపోయాడు.

మాధవి ముఖం క్షణక్షణానికీ మండిపోతూ ఉంది. భయంకరంగా అరుస్తూ వెళ్ళి చన్నీళ్ళతో ముఖం కడుక్కొంది. దాంతో మంటలు ఇంకా ఎక్కువయ్యాయి. ఆమె పెడబొబ్బలకు వరండాలో పడుకొని ఉన్న పని మనిషి పరుగెత్తుకొని వచ్చింది. అప్పటికప్పుడు రిక్షాలో తీసుకు వెళ్ళి మాధవిని హాస్పిటలులో చేర్చింది.

మాధవి వచ్చినప్పటి నుండీ ఆమె దగ్గర పని మనిషిగా ఉండడంతో ఆమెకు మాధవి భర్త పేరు, ఊరూ తెలుసు. మరుసటి ఉదయాన్నే ఆమె భర్తకు ఒక ఉత్తరం వ్రాసి పడేసి మాధవిని కనిపెట్టుకొని ఉంది.

ఉత్తరం అందుకొని వచ్చిన జనార్ధన్ ముఖమంతా బాండేజితో స్పృహ తప్పి పడి ఉన్న మాధవిని చూసి కన్నీరు కార్చాడు.

OOO

పదిహేను రోజులకు ఆమె గాయాలు కొంత వరకు మానాయి. ఈ ప్రమాదంలో ఆమెకు ఒక కన్నుపోయింది. ముఖంమీద కాలిన గాయాల వల్ల చర్మం లేచిపోయి తెల్లగా, భయంకరంగా తయారయింది. తన భర్త దగ్గరుండి ఎంతో ఖర్చుపెట్టి తనకు వైద్యం చేయించాడని తెలిసి ఆమె మనసు కృతజ్ఞతతో నిండిపోయింది.

మరుసటి రోజు డిశ్చార్జి చేస్తారనగా జనార్ధన్ మాధవికి దగ్గరగా కూర్చొని ''రేపు మన ఊరికి వెళ్దాం'' అన్నాడు.

కొద్దిసేపు మాధవి ఏం మాట్లాడలేదు. తరువాత చిన్నగా అంది.

''అక్కడికి ఏముఖం పెట్టుకొని వచ్చేది. మీకు నేను చేసిన అన్యాయానికి సిగ్గుపడుతున్నాను. ఇంత చెడిపోయిన దాన్ని. నన్ను తాకడం కూడా పాపమే. నేను రాను'' అంది భోరున ఏడుస్తూ.

''అయితే ఎలా బ్రతుకుతావు.''

''అడుక్కొని బ్రతుకుతాను. కాని నేను రాను.''

జనార్ధన్ గంభీరంగా అన్నాడు. ''మాధవీ నువ్వు పట్నవాసపు పైపై తళుకులను చూసి మోసపోయావు. ఒక వేళ నువ్వు నన్నొదిలి వెళ్ళిపోయినా నువ్వు నా భార్యవే. నేను ఎంతో పవిత్రంగా కట్టిన తాళి ఇంకా నీ మెడలో ఉంది. హిందూ సాంప్రదాయం ప్రకారం అది భార్య ఎడల భర్త బాధ్యతను తెలియజేసే బంధం. నా ఆస్తిలో సగభాగం నీకు వస్తుంది. నేను నీతో శారీరకంగా ఇక కాపురం చేయలేను. గత అయిదేళ్ళుగా మనసు మొద్దుబారి ఒంటరి జీవితానికి అలవాటుపడిపోయాను. నా ఇల్లు సగంవిభజించి నీకిస్తాను. నువ్వందులో ఉండు. పదెకరాల్లో సగం అయిదెకరాల పొలం మీద వచ్చే ధాన్యం నీకిస్తాను. నీ ఇష్టం వచ్చినట్టు చేసుకో. నువ్వు నా ఇంట్లో ఒక భాగంలో ఉండటం వలన నీకు రక్షణ కూడా కలుగుతుంది.''

తను నమ్మి వచ్చిన నందనరావు తనను నడిసముద్రంలో తోసేస్తే, తను వెన్నుపోటు పొడిచిన తన భర్తే తనకు నీడ చూపించే వాడయ్యాడు. బాధ్యత నెరిగి వివాహ బంధానికి తన భర్త ఇచ్చిన ప్రాధాన్యతకు ఆమె కరిగిపోయి రెండు చేతులెత్తి జనార్ధన్‌కు నమస్కరించింది.